# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | గురువారం 26 సెప్టెంబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 109

తెలుగు దినపత్రిక




# దసరాకు ఇందిరమ్మ కమిటీలు

- విధివిధానాలు రూపొందించండి..
- పీఎంఏవై నుంచి గరిష్టంగా ఇళ్లు సాధించాలి
- అర్హులందరికీ ఇండ్లు దక్కాలి..
- రాజీవ్ స్వగృహ ఇళ్లకు వేలం
- సీఎం రేవంత్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ :** దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయా లని సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లా మంత్రు లు, అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు, మండల,పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు దక్కాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మంత్రులు, అధికారులకు కీలక సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకున్నాయన్న సీఎం ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందన్నా రు. ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో రాష్ట్రానికి గరిష్ట సంఖ్యలో ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రాష్ట్రానికి రావల్సిన బకాయిలు రాబట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ ......(తరువాయి 2లో)

- అప్పులెలా తీసుకున్నారు..?
- ప్రాజెక్టు వైఫల్యాలకు బాధ్యులెవరు..
- రుణాలు తీసుకున్న తర్వాత కార్పొరేషన్కు ఆస్తులొచ్చాయా..?
- ఇంజినీర్లను ప్రశ్నించిన కాళేశ్వరం కమిషన్
- సమాధానాలు దాట వేసిన చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి
- ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ పీసీ ఘోష్ 4



## అప్పులతో ఆగం చేస్తిరి..



## కొత్త మురిపెం.. కొసెళ్లేనా..?

- ఆఖరి వరకు నడిస్తే అదే మహాభాగ్యం..
- గాంధీభవన్ లో ఫిర్యాదుల స్వీకరణ..
- ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తామన్న టీపీసీసీ మహేశ్, మంత్రి దామోదర
- తొలి రోజు 285 దరఖాస్తులు.. తక్షణమే 30 పరిష్కారం..

4

## మరో 35 వేల పోస్టుల భర్తీ..

- యువతకు ఉపాధియే లక్ష్యం..
- నిరుద్యోగులు డిమాండ్ సప్లయ్ సూత్రం గుర్తెరగాలి..
- ఉపాధి లేక చెడుమార్గంలో పోవొద్దు..
- రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీలపైనా దృష్టి 4
- బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి




## బలహీన వర్గాల అభ్యున్నతే ఐలమ్మకు నివాళి..

- ఆమె స్ఫూర్తితోనే బీఆర్ఎస్ బీసీలకు పథకాలు పెట్టింది..
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్..
- ఐలమ్మను స్మరించుకుంటూ నివాళి.. 4



## పోలింగ్ ప్రశాంతం..

- కశ్మీర్‌లో రెండో దశ ముగిసిన ఎన్నికలు..
- 26 అసెంబ్లీ స్థానాలకు ఎలక్షన్లు..
- అత్యధికంగా రియాసిలో 71.81 శాతం ఓటింగ్ 2
- దశాబ్దం తర్వాత అసెంబ్లీకి ఓటింగ్..
- సరళిని పరిశీలించిన విదేశీ దౌత్యవేత్తల బృందం



## హే.. క్యాప మోహన్ జీ.. 3

- ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు సబబేనా..?
- ప్రభుత్వాలను పడగొట్టడం మంచిదేనా..?
- ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు కేజ్రీ లేఖ..
- ఘాటుగా ఐదు ప్రశ్నలు సంధించిన ఆప్ కన్వీనర్



## ఆ వ్యాఖ్యలు వ్యక్తిగతం.. 4

- సాగు చట్టాలపై కంగనా స్టెప్ బ్యాక్..
- ఇబ్బందిపెడ్తే క్షమించమని వేడుకోలు..
- ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చుకున్న బీజేపీ ఎంపీ రనౌత్

# మూసీపై ముందడుగు..



## నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు..

### కూల్చివేతలకు 169 అదనపు పోస్టులు..

- మూసీపై అత్యవసర భేటీ..
- పరిసరాలను సందర్శించిన అధికారులు..
- 1,350 మంది మూసీ నిర్వాసితులకు హైడ్రా నోటీసులు
- 28, 29 తేదీల్లో కూల్చివేతలు
- రంగంలోకి మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు
- నిర్వాసితులను ఒప్పించేలా చర్చలు
- నగరశివారులో కొనసాగుతున్న హైడ్రా పనులు..

**కంపు కొడుతున్న మూసీ ఇప్పుడు రాజకీయానికి ఇంపుగా మారింది. అటు కాంగ్రెస్., ఇటు బీఆర్ఎస్., మధ్యే మార్గంగా బీజేపీ.. ఎవరికి వారుగా నది చుట్టే పొలిటికల్ గూడు అల్లుతున్నాయి. శుభ్రం చేస్తామని, ఆక్రమణలు కూల్చడమే అందుకు పరిష్కారమని అధికార పార్టీ పేర్కొంటుంటే., పాత పనులకు కొత్త ప్రతిపాదనలన్నట్టుగా తాము చేసింది రేవంత్ చెప్పుకుంటున్నాడని, పైగా ఆ పనులను పాకిస్తానీ కంపెనీకి కట్టబెట్టే భారీ కుట్రకు తెరతీస్తున్నాడని బీఆర్ఎస్ దుమ్మెత్తిపోస్తున్నది. రెంటింటి నడుమ కషాయం పార్టీ తనదైన శైలిలో ఇద్దరిని దుయ్యబడుతున్నది. బీజేపీతోనే అన్నీ సాధ్యమని, పూటకో మాటతో, ఒవైసీ బ్రదర్స్ సైగదాటని తీరుతో అటు కాంగ్రెస్ ఏమీ చేయలేదని, వారి మిత్రులుగా చెలమణి అవుతున్న కారు పార్టీ కూడా పొడిచేది ఏమీ ఉండదని సెలవిస్తున్నారు. హైదరాబాద్ లో రెచ్చిపోతున్న హైడ్రాను బూచీగా చూపుతూ, పనులపై పెదవి విరుస్తున్న వారితో అంటకాగుతూ మరింత ఆజ్యం పోస్తున్నట్టుగా బీజేపీ చేస్తున్న విష ప్రచారాన్ని, బీఆర్ఎస్ కడుపు మంటను పట్టించుకోమని తమ పని తాము చేసుకుంటూ వెళ్తామని సర్కార్ పెద్దలు ఖరాఖండిగా చెబుతున్నారు.**

**జనపదం, బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక మూసి రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ లో కీలక ముందడుగు పడింది. ఆ నదిని ప్రక్షాళన చేసి పరిసర ప్రాంతాలను సుందరీకరించడం ద్వారా విదేశీ పర్యటకులూ సందర్శించేలా ప్రణాళికలు రూపొందిస్తున్న రాష్ట్ర సర్కార్ ముందుగా క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వడివడిగా అడుగులేస్తున్నది. ఇప్పటికే అక్కడ నిర్మాణాలు కూల్చేందుకు వెళ్లిన హైడ్రా అధికారులను అడ్డుకున్న స్థానికులు తమకు పునరావాసం కల్పించిన తర్వాతే తమ నివాసాలు కూల్చాలని డిమాండ్ చేశారు. అయితే ఏకకాలంలో వందలాది మంది ఆశ్రయం కోల్పోతారని భావించిన సర్కార్ మూసీ పరివాహన ప్రాంతంలో నివసించే కుటుంబాల లెక్క వేసేందుకు సర్వే నిర్వహించింది. ఈ మేరకు అక్కడ 1,350 కుటుంబాలు నివసిస్తున్నట్లు సర్వే అధికారులు తేల్చారు. మరోవైపు ఇప్పటికే వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నెల 24న 16,200 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. మరోవైపు మరుసటి రోజే రంగంలో దిగిన హైడ్రా అధికారులు బుధవారం నిర్వాసితులందరికీ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో అక్కడున్న నిర్మాణాలు కూల్చివేస్తామని నోటీసుల్లో స్పష్టం చేసింది. నిర్వాసితులు మాత్రం ......(తరువాయి 3లో)

## హైడ్రాలో కొత్తగా 169 పోస్టులు

డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లో సిబ్బంది నియామకం ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం 4

## పాకిస్థాన్ కంపెనీకి కాంట్రాక్ట్..?

### మూసీ సుందరీకరణ పనులు అప్పగిస్తున్నట్టు కేటీఆర్ ఆరోపణలు..

రేవంత్ సర్కార్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు
భారీ కుంభకోణానికి తెర అంటూ మండిపాటు..
ప్రజలకన్నీ చెబుతామని హెచ్చరిక..
రేవంత్ ది పబ్లిసిటీ స్టంటే..
ప్రజలను మభ్యపెట్టడం కష్టమంటూ చురకలు...
హామీలు నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్..

2



## దారెటు కిట్టన్నా...?



- రాజీనామా సరే.. రైట్ చాయిస్ జరిగేనా..
- ఇప్పటికే పలు సందర్భాల్లో అపకీర్తి..?
- మరకలు తుడిచేసు కుంటారా..? ఇంకా అంటించుకుంటారా..?
- బీసీ నేతకు గాలమేయాలని కాంగ్రెస్ తహతహ..
- ముమ్మర యత్నాల్లో బీజేపీ కూడా.. 2

## ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం..



3

- దశాబ్దాలుగా వెనుకబడి వాటిని కంప్లీట్ చేస్తాం..
- 12 లక్షల ఎకరాలకు నీటిని ఇవ్వడమే ధ్యేయం
- పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# బీసీ గణనకు అడుగులు..

సీఎంను కలిసిన బీసీ కమిషన్..
హరిత హోటల్ లో మహేశ్ కుమార్ గౌడ్ బీసీ సంఘాలతో మీటింగ్..



**జనపదం, హైదరాబాద్ సిటీ :**

బీసీ కుల గణనకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికలు బీసీ లెక్కలు తీసిన తర్వాతే జరగాలనే డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ ఇరకాటంలో పడినట్టే అయింది. ఎన్నికల హామీలో భాగంగా వెంటనే కులగణన చేయాల్సిన అవసరం తప్పకుండా హస్తం సర్కార్ పై పడింది. కానీ అంతర్గతంగా నెలకొన్న రాజకీయం, ఆధిపత్య పోరు, అగ్రకులాల పెద్దల అడ్డుపుల్లల నేపథ్యంలో ప్రభుత్వం లెక్కలకు సుముఖంగా లేదని పలువురు బహిరంగంగానే విమర్శలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ, బీఆర్ఎస్ కులగణనకు పట్టుబడుతుండడంతో సహజంగానే అధికార పార్టీకి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో ఏదో ఓటి చేసి శాంతిపజేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

**సీఎంతో పీసీసీ అధ్యక్షుడి భేటీ..**

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు భేటీ అయ్యారు. ......(తరువాయి 2లో)

## 15 రోజుల్లో కులగణన ప్రారంభం..

# దారెటు కిట్టన్నా..?

- రాజీనామా సరే.. రైట్ చాయిస్ జరిగేనా..
- ఇప్పటికే పలు సందర్భాల్లో అపకీర్తి..?
- మరకలు తుడి చేసుకుంటారా..? ఇంకా అంటించుకుంటారా..?
- బీసీ నేతకు గాలమేయాలని కాంగ్రెస్ తహతహ..
- ముమ్మర యత్నాల్లో బీజేపీ కూడా..



కాంగ్రెస్ గాలం..?

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** బీసీ నేత ఆర్.కృష్ణయ్య దారెటు అనేది ఇప్పుడు లక్ష మిలియన్ల ప్రశ్న. ఇన్నాళ్లు వైసీపీ తరపున రాజ్య సభకు ప్రాతినిధ్యం వహించిన నాయకుడు నిన్న రాజీనామా చేయడంతో ఎన్నో అనుమానాలు, మరెన్నో సందేహాలు. రాజకీయంగా తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి జపం పెరుగుతున్న తరుణంలో ఆయన రిజైన్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే బీసీ కులగణనపై హాట్ హాట్ ఇష్యూ నడుస్తున్న ప్రస్తుత తరుణంలో కృష్ణయ్య రాజీనామా కలకలం రేపుతున్నది.

### రాజీనామా సరే.. రైట్ చాయిస్ జరిగేనా..

బీసీ నేత కృష్ణయ్య గతంలో దాదాపు అన్ని ప్రధాన పార్టీలతో అంట కాగిన విషయం తెలిసిందే. ఎప్పుడు ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితోనే తన జర్నీని కొనసాగిస్తున్నాడనే టాక్ ఆయనపై ఉన్న ప్రధాన మరక. పట్టుసడలకుండా ఉండలేడని, అవకాశ వాదం తోనే రాజకీయంగా మారుతూ ఉంటాడని పలువురు బహిరంగంగానే విమర్శించిన సందర్భాలూ ఉన్నాయి. అలాంటి అపకీర్తిని ఇప్పుడు కీలకమైన సందర్భంలో తుడిచిపెట్టుకుని పోయేలా మసులుకుంటాడా..? లేదంటే మళ్లీ ఏదో ఓ పంచన చేరి తనదైన మార్కును అలాగే నిలబెట్టుకుంటాడా..? అనుమాన పడేవారు కూడా లేకపోలేదు. ఏ ఎండకాగొడుగు పడుతూ బీసీ వాదాన్ని సొంతానికి వాడుకుంటున్నాడనే ఆయన తీరును ఇంతటి కీలకమైన సందర్భంలో చెరిపేసుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు రాజీనామా చేయడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా రాజకీయ వేడి పెరిగింది. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా బీసీ ముఖ్యమంత్రి కావాల్సిందే అనే నినాదం రోజురోజుకు బలాన్ని పెంచుకుంటున్న విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో కృష్ణయ్య లాంటి వ్యక్తిని తమ పార్టీలోకి లాక్కుంటే బలం పెంచుకోవచ్చని, బీసీ ఓటు బ్యాంకును కాపాడుకోవచ్చని భావించడంలో పార్టీలను తప్పుబట్టలేం. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేత మల్లు రవి ఇప్పటికే కృష్ణయ్యను కలిసి హస్తం లోకి రావాలని ఆహ్వానించడం హాట్ టాపిక్ గా మారింది. అదీ కాకుండా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కృష్ణయ్య స్వచ్ఛందంగా పలు బీసీ సభలు, సమావేశాల్లో పాల్గొంటూ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తూ బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ కలిసి సాగుతున్నారు. దీంతో బీసీ నేతలంతా కలిసి కొత్తగా పార్టీ ఏర్పాటు చేస్తారా..? అని అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారి సంఖ్య కూడా నానాటికి పెరుగుతూనే ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కూడా కృష్ణయ్యను తమతో కలిసి నడవాలని కోరుతున్నట్టు సమాచారం. అందుకే మళ్లీ రాజ్యసభ సీటు కట్టబెట్టి తమ బీసీ ఓటు బ్యాంక్ ను పెంచుకోవాలని ఉవ్విళ్లూతున్నట్టు తెలుస్తోంది. ఇలా ఎవరికి వారుగా కృష్ణయ్య వెంట పడుతుంటూ ఆయన ఏదారిని ఎంచుకుంటాడు..? ఎవరి పంచన చేరుతాడనేది అంతా ఆతృతగా చూస్తున్న విషయం. చివరకు సొంత దారిలో వెళ్తారా.. లేదంటే మళ్లీ ఏదో ఓదారి ఎంచుకుని అదే విధంగా సాగుతారా..? అనేది తేలాలంటే మరింత కాలం ఆగాల్సిందే.

# పాకిస్థాన్ కంపెనీకి కాంట్రాక్ట్..?

- మూసీ సుందరీకరణ పనులు అప్పగిస్తున్నట్టు కేటీఆర్ ఆరోపణలు..
- రేవంత్ సర్కార్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు
- భారీ కుంభకోణానికి తెర అంటూ మండిపాటు..
- ప్రజలకన్నీ చెబుతామని హెచ్చరిక..
- రేవంత్ ది పబ్లిసిటీ స్టంటే..
- ప్రజలను మభ్యపెట్టడం కష్టమంటూ చురకలు...
- హామీలు నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రేవంత్ సర్కార్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ కు చెందిన కంపెనీకి మూసీ నది సుందరీకరణ పనులను కట్టబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోంది అంటూ బాంబు పేల్చారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపాయి. బుధవారం ఫతేనగర్‌లోని సీవేజ్ ప్లాంట్ ను పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రేవంత్ ప్రభుత్వాన్ని పూర్తిగా ఇరకాటంలో పెట్టేలా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం రాష్ట్ర రాజకీయాలనే కాకుండా దేశ రాజకీయాల్లోనే సంచలనం కలిగించేలా కేటీఆర్ మాట్లాడారు. మూసీ సుందరీకరణ పనులు పాకిస్థాన్ కంపెనీకి కట్టబెట్టేందుకు రేవంత్ యత్నిస్తున్నారని, దీని వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. సుందరీకరణ పేరుతో భారీ కుంభకోణానికి రేవంత్ యత్నిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వాస్తవానికి మూసీ సుందరీకరణ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడో ప్రారంభిందన్నారు. దీంతో మూసీలో కొత్తగా చేయడానికి ఏం లేదని స్పష్టం చేశారు. చాలా వరకు తమ హయంలోనే సుందరీకరణ పనులు కూడా పూర్తి అయ్యాయని కేటీఆర్ వివరించారు. అయినా రేవంత్ సర్కార్ మూసీ ప్రాజెక్టు కోసం ఒకసారి లక్షా 50 వేల కోట్లు అని, మరోసారి రూ.50 వేల కోట్లని, ఇంకోసారి రూ.70వేల కోట్లు అని ఇష్టానుసారంగా లెక్కలు చెబుతున్నారన్నారు. రేవంత్ చెబుతున్న లెక్కలకు పొంతన లేకపోవడం వెనుక కుంభకోణం కసరత్తేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### బీఆర్ఎస్ హయాంలోనే షురూ..

గతంలోనే పూర్తి అయిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అంత ఖర్చు పెట్టి ఏం చేస్తారో ప్రజలకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయంలో ప్రతిరోజూ 20 కోట్ల లీటర్ల మురికి నీటిని శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ.4 వేల కోట్లతో 31 ఎస్టీపీలుర ఏర్పాటు చేశామన్నారు. వంద శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే సిటీగా హైదరాబాద్‌ను మార్చాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. కూకట్‌పల్లి ఫతేనగర్‌లోని 133 ఎంఎల్‌డీల ఎస్టీపీ ప్రారంభానికి రెడీగా ఉందన్నారు. త్వరలోనే మిగతా ప్రాంతాల్లోని ఎస్టీపీలను సందర్శిస్తామన్నారు. మురికి నీరు వెళ్లడంతోనే మూసీకి ఈ దుస్థితి వచ్చిందన్నారు. ఈ ఎస్టీపీలన్నీ పని చేసి స్వచ్ఛమైన నీరు మూసీలోకి వెళ్తే ప్రత్యేకంగా శుద్ధి చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అలాంటి విషయంపై సీఎంతోపాటు మిగతా మంత్రులు కాంగ్రెస్ నేతలు నోటికొచ్చిన ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రోజుకో మాట వింటుంటే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

### భారీ కుంభకోణం..


మూసీ సుందరీకరణ పేరుతో భారీ కుంభకోణం కోసం జరుగుతున్న తెరచాటు యత్నాలను బీఆర్ఎస్ పార్టీ ప్రజల ముందు ఉంచుతుందని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, తగు సమయంలో ఖచ్చితంగా కాంగ్రెస్ కు బుద్ధి చెప్పనున్నారన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సుందరీకరణ పేరుతో నాటకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పబ్లిసిటీ స్టంట్లతో ఎక్కువ కాలం ప్రజలను మభ్యపెట్టలేరని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌కు చేసిన మంచి ప్రజలకు బాగా తెలుసు అన్నారు. కాగా, మూసీ చుట్టూ ఉన్న వాళ్లకు 12 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామన్న రేవంత్ ప్రకటనను స్వాగతిస్తున్నమని కేటీఆర్ ప్రకటించారు. అయితే గతంలో చేసిన ప్రకటనలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా కట్టించలేదని ఆరోపణలకు ఇచ్చే సమాధానమేంటని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నగరమంతా తిప్పి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు చూపించిన సంగతి మర్చిపోయారా అని ప్రశ్నించారు. అంతే కాకుండా ఇప్పుడు అవే ఇళ్లను మూసీ బాధితులకు ఇస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వాటిని కేసీఆర్ ప్రభుత్వం కట్టకపోయి ఉంటే ఇప్పుడు ఎలా ఇచ్చేవారని కేటీఆర్ రాష్ట్ర సర్కార్ ను నిలదీశారు

# బీసీ గణనకు అడుగులు..

**(మొదటిపేజీ తరువాయి) చేపట్టబోయే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. హామీని నెరవేర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపై సాధ్యాసాధ్యాలను చర్చించినట్టు సమాచారం. అంతేకాకుండా రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధి విధానాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణన ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని కూడా కోరారు. ఇప్పటికే జరగాల్సిన ఆలస్యం జరిగిందని, ఇంకా ఉపేక్షించడానికి లేదని, వెంటనే బీసీ కులగణనకు కార్యాచరణ ప్రారంభించి, వేగంగా ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు కూడా ఇచ్చారు. సంబంధిత ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం తరపున తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని, కూడా సీఎం హామీ ఇచ్చారు.**

# జానీ పై థర్డ్ డిగ్రీ వద్దు..

- పోలీస్ రిమాండ్ కు మాస్టర్
- 4రోజులకు అనుమతి ఇచ్చిన కోర్టు



**జనపదం, క్రైం బ్యూరో:** లైంగిక దాడి కేసులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కు షాక్ తగిలింది. ఆయనను 4 రోజుల పోలీస్ కస్టడీకి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు అనుమతించింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ నార్సింగి పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. నాలుగేండ్ల నుంచి జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించడంతోపాటు బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్టు బాధితురాలు ఆరోపిస్తున్నందున పూర్తిస్థాయి విచారణ నిమిత్తం ఆయనను కస్టడీకి అప్పగించాలని ఆ పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేయగా.. నేడు జానీ మాస్టర్‌ను కస్టడీకి అనుమతిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, జానీ మాస్టర్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగించొద్దని, న్యాయవాది సమక్షంలోనే విచారించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుతో పోలీసులు జానీ మాస్టర్‌ను విచారించనున్నారు.

# జమ్మూకశ్మీర్ లో రెండో దశ పోలింగ్

- 56.05 శాతం ఓట్లు నమోదు
- 26 అసెంబ్లీ స్థానాలకు ముగిసిన ఎన్నికలు
- అత్యధికంగా రియాసిలో 71.81 శాతం ఓటింగ్
- దశాబ్దం తర్వాత అసెంబ్లీకి ఓటింగ్
- అక్టోబరు 1న 3వ దశ పోలింగ్
- 8న ఓట్ల లెక్కింపు
- సరళిని పరిశీలించిన విదేశీ దౌత్యవేత్తల బృందం



**జనపదం, న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రెండో దశ పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. రెండో దశలో ఆరు జిల్లాల పరిధిలోని 26 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరిగింది. 25లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు వేశారు. రెండో శ్రీనగర్ జిల్లాలోని ఎనిమిది స్థానాలకు ఓటింగ్ జరిగింది. రియాసిలో ఆరు, బుద్గామ్‌లో ఐదు, రియాసి, పూంచ్ జిల్లాల్లో మూడు చొప్పున, గందర్‌బల్‌లో రెండు స్థానాలకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు జమ్మూ కశ్మీర్‌లో 54 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా రియాసి జిల్లాలో 71.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, శ్రీనగర్ జిల్లాలో అత్యల్పంగా 27.31 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. ఇంతకు ముందు 18న జరిగిన తొలి దశలో 61.38 శాతం ఓటింగ్ శాతం నమోదైన విషయం తెలిసిందే. అత్యధికంగా కిష్త్వార్ జిల్లాలో 80.20 శాతం ఓటింగ్ జరగ్గా.. అత్యల్పంగా పుల్వామా జిల్లాలో 46.99 శాతం ఓటింగ్ నమోదైంది. రియాసిలోని ఓ పోలింగ్ కేంద్రంలో 102 ఏళ్ల వృద్ధుడు హగీ కరీమ్ దిన్ భట్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటేసిన అనంతరం పోలింగ్ కేంద్రం ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే అభివృద్ధి పనులు బాగా జరుగుతాయని అన్నారు. పిల్లలకు మంచి విద్య లభిస్తుందని చెప్పారు. వ్యాపారాలు మెరుగుపడుతాయన్నారు.

### దశాబ్దం తర్వాత..

దాదాపు దశాబ్దం తర్వాత రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నిక పోలింగ్‌ను పరిశీలించేందుకు 15 మంది విదేశీ దౌత్యవేత్తల బృందం బుధవారం ఉదయం శ్రీనగర్ చేరుకుంది. ఈ ప్రతినిధి బృందానికి యూఎస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జోర్గాన్ అండ్రూస్ నేతృత్వం వహిస్తున్నారు. మరో రెండు రోజులపాటు రాష్ట్రం ఈ దౌత్యవేత్తల బృందం పర్యటించనుంది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజలతో ఈ బృందం భేటీ కానుంది. ఈ ప్రతినిధి బృందం వెంట భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న చర్యల పట్ల విదేశీ ప్రతినిధుల బృందం హర్షం వ్యక్తం చేసిందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు, మూడు విడతల్లో ఎన్నికలు పోలింగ్ జరగనుందని.. వాటిని పరిశీలించేందుకు న్యూఢిల్లీలోని వివిధ రాయబార కార్యాలయాల ద్వారా వివిధ దేశాల నుంచి 20 మంది దౌత్యవేత్తలను ఆహ్వానించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

# సాగు భూములకే రైతు భరోసా

- దసరా పండుగ నుంచి ప్రారంభం
- క్షేత్రస్థాయి నుంచి అందిన నివేదికలు
- ఇప్పటి వరకు 1.31 కోట్ల ఎకరాల్లో పంట
- ఎకరాకు రూ. 7,500 చొప్పున భరోసా సాయం
- రూ. 10 వేల కోట్ల సర్దుబాటుకు సన్నాహాలు
- వచ్చే నెల మొదటి వారంలో మార్గదర్శకాలు



**జనపదం, బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం మరో సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికి రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు దాదాపుగా రంగం సిద్ధమైంది. దసరా పండుగ నుంచి రైతులకు ఈ పథకం నిఅధు నిధులను ప్రభుత్వం పంపిణి చేయనుంది. ఈ మేరకు శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే రైతు భరోసాను సాగు భూములకు మాత్రమే అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే క్షేత్ర స్థాయి నుంచి పూర్తి స్థాయిలో నివేదికలను తెప్పించుకుంది. గత ప్రభుత్వం హయంలో సాగు చేయని భూములకు, కొండలు, గుట్టలు ఉన్న భూములకు సైతం ఆర్థిక సాయం అందజేసింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలు తలెత్తడంతో రేవంత్ సర్కార్ ఆచూతూచి నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే కేవలం సాగు భూములకు మాత్రమే రైతు భరోసాను అందించాలని తలపెట్టింది. దీనికి సంబంధించిన విధివిధానాలు రూపొందించి అక్టోబర్ తొలి వారంలో మార్గదర్శకాలను వెల్లడించనుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ వానాకాలం సీజన్లో 1.31 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో అత్యధికంగా వరి సుమారు 70 లక్షల ఎకరాల్లో సాగు జరిగినట్లుగా అధికారులు తేల్చారు. అలాగే పప్పు ధాన్యాల పంటలు సుమారు 5.82 లక్షల ఎకరాలు, ఆయిల్ పంటలు 4.25 లక్షల ఎకరాలు, పత్తి 43.48 లక్షల ఎకరాల్లో సాగు అయినట్లుగా అధికారులు లెక్కించారు. కాగా సాకైన ఆ మొత్తం భూములకు ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా డబ్బులు ఇస్తే దాదాపు రూ.10 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన నిధులు సిద్ధం చేయాలని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌ను ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఇస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం మూడు విడతల్లో పూర్తి చేసింది. దాదాపు రూ.31 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన మరికొందరు రైతులకు రైతు రుణమాఫీ సాయం అందలేదు. అలాంటి రైతులకు కూడా మాఫీ సొమ్మును అందించేందుకు గాను ప్రస్తుతం సర్వే నిర్వహిస్తోంది. కాగా, రైతు రుణమాఫీ అమలు కావటంతో అన్నదాతలు రైతు భరోసా పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

### అక్టోబర్ 12 నుంచేనా..?

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీల్లో రైతు భరోసా పథకం కూడా ఒకటి. ఈ పథకం కింద పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించింది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 15 వేలు పంట పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పింది. ఈ మేరకు రైతు భరోసా పథకం అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముహూర్తం ఫిక్స్ చేసింది. దసరా (అక్టోబర్ 12) నుంచి రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఎకరాకు రూ.7,500 చొప్పున కొన్ని నిబంధనలతో పకడ్బందీగా రైతు భరోసాను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే గత ప్రభుత్వం రైతుబంధు పథకం పేరుతో ఎకరాకు రూ. 10 వేలు రెండు విడతల్లో అందించింది. కేబినెట్ సబ్ కమిటీ చేపట్టిన అభిప్రాయ సేకరణలో అత్యధికంగా ఏడున్నర ఎకరాలలోపే పెట్టుబడి సాయం ఇవ్వాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఆ తర్వాత 10 ఎకరాలకు పరిమితం చేయాలనే కూడా కొన్ని ప్రతిపాదనలు కూడా వచ్చాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో రైతుభరోసా పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. మొత్తం మీద దసరా పండుగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేయాలని తలపెట్టడం....రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## దసరాకు ఇందిరమ్మ కమిటీలు

(మొదటిపేజీ తరువాయి) సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని సూచించారు.

**రాజీవ్ స్వగృహకు వేలం వేయండి**

రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లా క్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వి.పి.గౌతమ్ పాల్గొన్నారు.

# ప్రశాంతత.. నిద్ర దూరమైనై..

- అంతా హైడ్రా టెన్షనే..
- నా విద్యాసంస్థలకు నోటీసులిచ్చిండ్రు..
- కాంగ్రెస్ హయాంలోనే వాటిని కట్టిన..
- ప్రజల దృష్టి మరల్చడానికే సీఎం ఎత్తుగడ
- మాజీ మంత్రి మల్లారెడ్డి



**జనపదం, యాదాద్రి:** హైడ్రా దూకుడు నేపథ్యంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డికి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన విద్యాసంస్థలకు హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే ఆ నోటీసులు వచ్చినప్పటి నుంచి తనకు ప్రశాంతత, నిద్ర లేవని తాజాగా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని సతీసమేతంగా దర్శించుకున్న మల్లారెడ్డికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన మల్లారెడ్డి.. హైడ్రా వల్ల ప్రశాంతత లేదు.. నిద్ర లేదని చెప్పారు. హైడ్రా అధికారుల నుంచి తన కాలేజీలకు నోటీసులు వచ్చాయని.. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏం చేస్తుందోనని ఆందోళన చెందాల్సి వస్తోందన్నారు. అయితే తనకు ఉన్న విద్యాసంస్థలు మొత్తం గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే నిర్మించానని చెప్పారు. అప్పుడు కట్టిన కాలేజీలకు ఇప్పుడు నోటీసులు ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజల ఇళ్లను కూల్చి వారిని రోడ్డు మీద పడేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదని మల్లారెడ్డి హితవు పలికారు. తెలంగాణలో ప్రజలను హైడ్రా.. నానా హైరానాకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి సర్కార్.. హైడ్రాను ప్రయోగిస్తోందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇళ్లను కూల్చివేసి ప్రజలను రోడ్లపై పడేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏమొచ్చిందని ప్రశ్నించారు. కూల్చివేతలు ఆపి.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

### హైడ్రా గురించి ఆనాడే చెప్పిన కేసీఆర్

ఏదో యుద్ధం చేసినట్లుగా కాంగ్రెస్ సర్కార్ హైదరాబాద్‌లో ఇళ్లను కూల్చివేస్తున్నారని మల్లారెడ్డి విమర్శించారు.పేదల ఇండ్లను కూల్చివేస్తే ఏమీ వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు.. కేసీఆర్, కేటీఆర్‌లను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తాను ఓ సవాల్ చేస్తున్నానని.. కేసీఆర్ పాలనలో పండించిన పంట కంటే ఇప్పుడు ఎక్కువ పంట పండిస్తే కాంగ్రెస్ నేతలకు వాళ్లకు తాను పాలాభిషేకం చేస్తానని తేల్చి చెప్పారు. రేవంత్ రెడ్డి పాలనలో రైతు భరోసా లేదని, రుణమాఫీ పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు సహజమేనని.. మంత్రుల మధ్య కూడా సఖ్యత లేదని మల్లారెడ్డి ఆరోపించారు.

# 2-9 ఏళ్ల పిల్లలపై కేసు..

- కారుకు గీతలు గీశారని ఎఫ్ ఐఆర్
- కంప్లైంట్ ఇచ్చిన కానిస్టేబుల్
- కేసు నమోదు చేసిన పోలీసులు
- హన్మకొండ సుబేదారి పోలీసుల తీరుపై విమర్శలు




**స్పాటు వాయిస్, క్రైం:** పిల్లలు తెలిసి తెలియక చేసిన పనికి ఓ కానిస్టేబుల్ కర్కశంగా ప్రవర్తించాడు. తన కారుపై గీతలు గీశారనే కోపంతో ఏకంగా ఎనిమిది మంది చిన్నారులపై కేసు పెట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. హన్మకొండ రాంనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఓ కానిస్టేబుల్ సీఐడీ విభాగంలో పనిచేస్తున్నాడు. జూలై 7న అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో చిన్నారులు ఆడుకుంటుండగా.. అక్కడే పార్క్ చేసిన కానిస్టేబుల్ కారుపై గీతలు పడ్డాయి. ఈ విషయాన్ని కానిస్టేబుల్ పిల్లలు తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తన కారుకు గీతలు పెట్టారని సదరు సీఐడీ కానిస్టేబుల్ పిల్లలపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకొని చిన్నారులపై కేసు పెట్టాలని ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు.. కారు మరమ్మతుకు డబ్బులు చెల్లిస్తామని చెప్పారు. అయినా కానిస్టేబుల్ వినిపించుకోలేదు. ఆగస్టు 5న చిన్నారులపై సుబేదారి పోలీసులకు కానిస్టేబుల్ ఫిర్యాదు చేయగా.. వారు 8 మంది చిన్నారులపై కేసు నమోదు చేశారు. కేసు నమోదైన చిన్నారులంతా 2 నుంచి తొమ్మిదేళ్లలోపు వయసు వారే ఉండటం గమనార్హం. నెలన్నర క్రితమే ఈ కేసు పెట్టినా.. విషయం బయటకు పొక్కలేదు. ఇటీవల కేసు నమోదైన పిల్లల తల్లి దండ్రులను స్టేషన్‌కు పిలవడంతో కేసు విషయం బయట పడింది.చిన్న పిల్లలు తెలియక చేసిన తప్పును మన్నించకుండా కానిస్టేబుల్ కర్కశంగా తన పరపతిని ఉపయోగించి కేసులు పెట్టించారని తల్లిదండ్రులు వాపోతున్నారు. కేసు నమోదు వల్ల పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసుపై సుబేదారి సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. పిల్లలు కారుపై గీతలు గీసినట్లు సీసీ కెమెరాల్లో నమోదైందన్నారు. ఇక ఈకేసు తీవ్రమైన కాదని చెప్పారు. కారు యజమానికి వాహన బీమా మొత్తాన్ని క్లెయిమ్ చేయడానికి ఎఫ్ఐఆర్ అవసరం అవుతుందని.. అందుకోసమే ప్రాథమికంగా కేసు పెట్టినట్లు చెప్పారు.



## పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**

**జనపదం, నాంపల్లి :** దసరా పండుగలోగా పెండింగ్ లో ఉన్న పంచాయతీ బిల్లుల ను వెంటనే చెల్లించాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయ న మీడి యాతో మాట్లాడా రు. పెండింగ్ బిల్లులు అందక, నిధులలేమితో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ లు, గ్రామ పంచాయతీలను కేసీఆర్ సర్కార్ విస్మరిస్తోందని గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి మాట్లాడారని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆనాడు మాట్లాడిన ఒక్క మాటను కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. నిధులు వస్తాయనే నమ్మకంతో అనేక మంది సర్పంచ్ సొంత డబ్బులును ఖర్చుపెట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించారని ఆయన గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు అందకపోవడంతో బెంగతో కొందరు సర్పంచ్ లు మంచాన పడ్డారని, ఆసుపత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ ల పరిస్థితులను అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఆయన కోరారు.



## హీరో మోహన్ బాబు ఇంట్లో చోరీ

**జనపదం, క్రైంబ్యూరో:** సినీ నటుడు మంచు మోహన్‌బాబు నివాసంలో చోరీ జరిగింది. హైదరాబాద్ జల్‌పల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం రాత్రి రూ.10 లక్షలు చోరీ అయ్యాయి. ఇంట్లో పని చేసే పని మనిషి నాయక్ దొంగతనం చేసినట్టు మోహన్‌బాబు రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉదయం కల్లా పనిమనిషి నాయక్‌ను పోలీసులు తిరుపతిలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతన్ని పోలీసులు విచారణ చేస్తున్నారు. చోరీకి ఒక్కడే పాల్పడ్డాడా ఇంకా అతని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో నిందితుడిని ప్రశ్నిస్తున్నారు. కాగా గతంలో కూడా ఫిల్మ్ నగర్‌లోని ఇంట్లో డబ్బులు, నగలు పనివారే దొంగిలించారు.

## మూసీపై ముందడుగు..

(మొదటిపేజీ తరువాయి) తమకు ఇళ్లు కేటాయించిన తర్వాతే ఇక్కడ్నుంచి కదలుతామని స్పష్టం చేశారు. అప్పటి వరకు కదిలేది లేదని భీష్మించుకున్నారు. దీంతో ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం మూసీ పరివాహక ప్రాంతాలున్న మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లను రంగంలో దింపింది. క్షేత్రస్థాయిలో పర్యటించిన మూసీ నిర్వాసితులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామనే భరోసా కల్పించాలని, ఆ ప్రక్రియ తుది దశలో ఉందనే విషయాన్ని వివరించాలని సూచించింది. దీంతో రంగంలో దిగిన ఆయా జిల్లాల కలెక్టర్లు వారిని సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా పరిధిలో గండిపేట, రాజేంద్రనగర్ ప్రాంతంలో 4 బృందాలతో సర్వే జరుగుతుండగా హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలతో సర్వే నిర్వహిస్తున్నారు. ఆ సర్వేల ఆధారంగా నిర్వాసితుల్లో అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించనున్నారు.

### అమీన్ పూర్ లో హైడ్రా దూకుడు..

అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి ఎన్ని ఆరోపణలు, విమర్శలు వెలువెత్తుతోన్నా హైడ్రా మాత్రం వెనకడుగు వేయడం లేదు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్దచెరువును హైడ్రా అధికారులు రీసర్వే చేశారు. గతంలో ఇక్కడ అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా అధికారులు గోల్డెన్ కీ, వాణీనగర్, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, వెంకటరమణ కాలనీలో రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో నవ్య చౌరస్తాలో అక్రమంగా కట్టిన భవనాన్ని కూల్చివేశారు.

### ఫిర్యాదులతో రంగంలో హైడ్రా...

పెద్దచెరువు కబ్జా చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కట్టారని హైడ్రాకు ఫిర్యాదులు అందడంతో, చెరువు పరిధిలోని పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇదే ప్రాంతంలో నిర్మాణాలు కూల్చి మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. అలాగే అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేట్, పటేల్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి వాణిజ్య కార్యకలాపాల కోసం భవనాలను నిర్మించినట్లు హైడ్రా గుర్తించింది. కిష్టారెడ్డిపేటలో సర్వే నెంబర్ 164లో వాణిజ్యపరంగా నిర్వహిస్తున్న 3 ఐదంతస్తుల భవనాలను కూల్చివేశామని, అక్కడ ఎకరం ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వివరించింది. పటేల్గూడలోని సర్వే నెంబర్ 12/2, 12/3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి 25 నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని హైడ్రా గుర్తించింది. వాటిని తొలగించి 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. పెద్ద చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని 51 ఎకరాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అలాగే రోడ్లను సైతం ఆక్రమిస్తూ పద్మావతి నగర్లో ఏర్పాటు చేసిన అక్రమ లేవుట్కు సంబంధించిన ప్రహరీ గోడతో పాటు రెండు సెక్యూరిటీ గదులను హైడ్రా అధికారులు తొలగించారు. అమీన్‌పూర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ, ఆట స్థలాన్ని హైడ్రా నేలమట్టం చేసింది. ప్రొక్లెయిన్ సాయంతో ప్రహరీని కూల్చి దాదాపు 15 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబర్ 462లో 38 గుంటల ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలను తొలగించారు. ఆ దుకాణాలు స్థానిక మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డివిగా గుర్తించిన అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

# అన్నాదమ్ముల దోపిడీ..

- తెలంగాణలో షాడో గవర్నమెంట్..
- రేవంత్ కు పైసల మీద ప్రేమ..
- మంత్రులు సైతం ఎక్కడికక్కడే దోపిడీ..
- ఎన్నికల్లో అడ్డగోలు అబద్దాలు చెప్పారు..
- ఒక్క హామీ నెరవేర్చలే..
- హామీల వారీగా కమిటీలు..
- ప్రజలను కేసీఆర్ ను కోరుకుంటున్నారు..
- బీఆర్ఎస్‌వర్కింగ్‌ప్రెసిడెంట్‌కేటీఆర్




**రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**

**జనపదం, హైదరాబాద్ సిటీ :** సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన అన్నాదమ్ములు తెలంగాణలో స్వైరవిహారం చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్‌తో పాటు మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూధనాచారి, ఇతర నేతలు పాల్గొన్నారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ ఈ దఫా ముఖ్యమంత్రి అవుతానని రేవంత్‌రెడ్డి కూడా అనుకోలేదని, ఈ విషయం ఆయన దోస్తులే తనకు చెప్పారని ఎద్దేవా చేశారు. 2028లోనే సీఎం అవుదామనుకొని, ఈ దఫా ఎన్నికల్లో నోటికొచ్చినట్లు అడ్డగోలు అబద్ధాలు చెప్పారని పేర్కొన్నారు. కొత్త పథకాలు కాదు ఉన్నవి ఇస్తేనే ముఖ్యమంత్రి గొప్ప అని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డలకు తులం బంగారం అన్నాడు. తులం ఇనుము కూడా లేదని వాపోయారు. మంత్రులు సైతం ఎక్కడికక్కడ దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి రాష్ట్రం మీద, ప్రజల మీద ప్రేమ లేదని పైసలు సంపాదించుకోవడం మీదే ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశఆరు.

### బీజేపీ ఎంపీలు కాంగ్రెస్‌కు రక్షణ

కాంగ్రెస్ మీద తాము పోరాటం చేస్తుంటే బీజేపీ ఎంపీలు వాళ్లకు రక్షణ కవచంగా వస్తున్నారని కేటీఆర్ ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రకటించిన అన్ని డిక్లరేషన్‌ల మీద పోరాడుతున్నామని, నిత్యం కాంగ్రెస్ అవినీతిని ఎండగట్టాలని నేతలకు పిలుపునిచ్చారు. కుంభకోణాలు చేసే నేతల బుద్ధి మారదని వరంగల్‌లో భూకబ్జాలు జరుగుతున్నాయని తెలియజేశారు. డీఎంకే పార్టీ 76 ఏళ్లుగా తమిళనాడులో రాజకీయాలను శాసిస్తోందని గుర్తు చేశారు. పార్టీ నుంచి పోయిన చెత్త అంతా పోనివ్వండని, గతంలో జరిగిన తప్పులు జరగకుండా చూసుకొని పార్టీని మంచిగా నిర్మాణం చేసుకుందామని పిలుపునిచ్చారు.

### పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు

పెద్దపెద్ద నాయకులు మంచి పదవులు అనుభవించి రేవంత్‌రెడ్డి చుట్టూ తిరుగుతున్నారని పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పుతో వారికి భయం మొదలైందని కేటీఆర్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఉపఎన్నికకు రాజయ్య అభ్యర్థి అని ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఓటమి కూడా మంచిదేనని వ్యాఖ్యానించారు. గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుందని, చిట్టి నాయుడు ఉంటేనే కదా కేసీఆర్ విలువ తెలిసేది అని వ్యంగ్యంగా విమర్శించారు. ప్రభుత్వం తీరు చూసి కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్రంలో ప్రజలంతా ఇప్పుడు గులాబీ కండువా వైపే చూస్తున్నారని ఆయన తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములు కండి

- అమెరికన్ కంపెనీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- ఫోర్త్ సిటీ నిర్మాణంలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి
- లాస్ వేగాస్ లో మైనెక్స్-2024 ప్రదర్శన
- అమెరికన్ పరిశ్రమలు, వ్యాపార సంస్థలతో భట్టి భేటీ




**జనపదం, బ్యూరో :** రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, ఫోర్త్ సిటీ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అమెరికన్ పరిశ్రమలు, వ్యాపారవేత్తలను విజ్ఞప్తి చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన బుధవారం అమెరికాలోని లాస్ వేగాస్ లో ప్రారంభమైన అంతర్జాతీయ మైనెక్స్–2024 ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం పలు అమెరికన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ భారతదేశంలో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు, వ్యాపారాలకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోన్న హైదరాబాద్ లో ఖనిజ పరిశ్రమాభివృద్ధికి దోహదపడాలన్నారు. ఇందుకు అ నుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. భూగర్భంలో దాగిన విలువైన ఖనిజాలను వెలికితీయడంలో, నిలకడగల అభివృద్ధిని సాధించడంలో అమెరికన్ కంపెనీలు భాగస్వాములు కావొచ్చన్నారు. హైదరాబాద్ కు అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫోర్త్ సిటీలో కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇక్కడ స్థాపించిన అమెరికన్ కంపెనీలు ఎంతో సౌకర్యవంతంగా తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయని, ఇంకా వివిధ రం గాల పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగరేణికి క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన ఇరుదేశాధినేతల సమావేశంలో పరస్పరం రెండు దేశాలు ఒకరికొకరు తోడ్పడాలని అంగీకరించిన నేపథ్యంలో అమెరికన్ కంపెనీలు మరింతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమెరికన్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న గ్లోబల్ మార్కెట్స్ సహాయ కార్యదర్శి అరుణ్ వెంకటరామన్ మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్ లో అమెరికాకు చెందిన పలు సంస్థలు తమ వ్యాపార కార్యకలాపాలు విజయవంతంగా నిర్వహించుకుంటున్నాయన్నారు. ఈ ఒరవడిని కొనసాగిస్తూ మరిన్ని అమెరికన్ సంస్థలు తెలంగాణలో తమ వ్యాపారాలు ప్రారంభిస్తాయని ఆయన ఆశాభావం ప్రకటించారు.

### 1900 కంపెనీల పదర్శన..

నాలుగేళ్లకోసారి జరిగే భారీ అంతర్జాతీయ మైనెక్స్–2024 ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 1900 యంత్ర ఉత్పత్తి సంస్థలు తమ స్టాల్స్ ను ఏర్పాటు చేసుకున్నాయి. వీటిలో భారీ మైనింగ్ తవ్వకాల యంత్రాలు, ఖనిజ రవాణా వాహనాలు, రక్షణ సేవలు, అనుబంధ యంత్ర విభాగాలను ప్రదర్శనకు ఉంచారు. 121 దేశాల నుంచి సుమారు 44,000 వేల మంది ప్రతినిధులు దీనిలో పాల్గొంటున్నారు. రాష్ట్రం నుంచి తొలిసారిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కమల్లు సారథ్యంలోని రాష్ట్ర అధికారుల బృందం ప్రముఖ ఖనిజ పరిశ్రమల యంత్ర తయారీ సంస్థలైన కొమాట్సు, క్యాటర్ పిల్లర్, బీకేటీ టైర్స్ తదితర స్టాల్స్ ను సందర్శించారు. పర్యటనలో రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి శ్రీ రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా అమెరికన్ ప్రతినిధి బృందంలో ఇంకా గ్లోబల్ మార్కెట్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ ఒలిమర్ రివేరానోవా, కమర్షియల్ స్పెషలిస్ట్ శాంతను సర్కార్, ఇంటర్నేషనల్ ట్రేడ్ స్పెషలిస్ట్ కార్నిలియస్ గ్యాంఫి, గ్లోబల్ ఎనర్జీ సెక్టార్ లీడర్ డేరెక్ట్ శ్లికెషన్, గ్లోబల్ డిజైన్ అండ్ కన్స్ట్రక్షన్ స్పెషలిస్ట్ జాస్మిన్ బ్రాస్ వెల్ తదితరులు ఉన్నారు.

# రాహుల్.. చరిత్ర తెలుసుకో!

- దేశమంతా పాదయాత్ర చేసినా ఏం నేర్చుకోలే..?
- రాజా హరిసింగ్‌ను అవమానిస్తారా?
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.
- జమ్మూకశ్మీర్ అభివృద్ధిపై రాహుల్ బహిరంగ చర్చకు రావాలని సవాల్



**జనపదం, బ్యూరో :** డోగ్రాల ఆత్మగౌరవమైన మహారాజా హరిసింగ్‌ను విషయంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నారని, ఆయన చరిత్ర తెలుసుకోవాలని, దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసినా దేశ చరిత్రమీద, వాస్తవ పరిస్థితులమీద ఆయననకు కనీస అవగాహన కూడా రాలేదని అర్థమవుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జమ్మూ కాశ్మీర్ లో బీజేపీలో డోగ్రా స్వాభిమాన్ సంఘటన్ పార్టీ విలీనం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉంటున్నాయని, గత మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ను ప్రజలు ఓడించినా వారితో ఏమాత్రం మార్పురాలేదని, భవిష్యత్తులోనూ రాహుల్ దేశ పరిస్థితులను అర్థం చేసుకుంటారని నేను అనుకోవడం లేదన్నారు. జమ్మూ కాశ్మీర్లో దాదాపుగా ప్రతి ఇంట్లో మహారాజా హరిసింగ్ ఫొటో ఉంటుందని, ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, అలాంటి వ్యక్తి విషయంలో రాహుల్ గాంధఈ మాట్లాడిన మాటలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. మహారాజా హరిసింగ్ ను అవమానించడమంటే యావత్ డోగ్రా సమాజాన్ని, జమ్మూకాశ్మీర్ ప్రజలను అవమానించడమేన్నారు. గవర్నర్ వ్యవస్థను, లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవస్థను మోడీయో, బీజేపీయో తీసుకురాలేదని, దేశవ్యాప్తంగా ఉందని, లెఫ్టినెంట్ గవర్నర్ గురించి కూడా చులకనగా మాట్లాడడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ మొదలు దేశ చరిత్ర, రాజకీయ పరిజ్ఞానం పెంచుకున్న తర్వాతే బహిరంగ వేదికలమీద మాట్లాడటం నేర్చుకోవాలన్నారు.

### బహిరంగ చర్చకు రావాలని సవాల్..

జమ్మూ కాశ్మీర్లో 60 ఏళ్లలో మీరేం చేశారో.. గత 10 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వంఏం చేసిందో చెప్పేందుకు బహిరంగ చర్చకు రావాలని రాహుల్ గాంధీకి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మహారాజా హరిసింగ్ పార్కులోని ఆయన విగ్రహం ముందు.. మీడియా ప్రజలు, మేధావుల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడిన దానికి కట్టుబడి ఉంటే.. నా సవాల్ స్వీకరించాలని, బహిరంగ చర్చకు రావాలని పిలుపునిచ్చారు. జమ్ము కాశ్మీర్లో శాంతి నెలకొల్పడంలో, ప్రతి పేదవాడికి ఇండ్ల నిర్మాణంతో పాటు ఇంటికి టాయిలెట్లు, గ్యాస్ సిలిండర్ ఇవ్వడంలో.., రూ. ఐదులక్షల ఆరోగ్య బీమా, యువతకు, మహిళలకు చేయుత నందించడం ఇలా ఎన్నో పనులు జమ్మూకశ్మీర్లో మోడీ ప్రభుత్వం చేసిందన్నారు. 2004–2014 మధ్యలో.. మీ పరిపాలనలో జమ్మూకశ్మీర్లో అశాంతి, అలజడి తప్ప మీరు సాధించిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఇతర దేశాల్లో భారతదేశాన్ని అవమానించే రీతిలో మాట్లాడితే చరిత్ర క్షమించదన్నారు బుధవారం బీజేపీలో విలీనమైన డోగ్రా స్వాభిమాన్ సంఘటన్ పార్టీ నేతలందరికీ కిషన్ రెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. వారందరికీ పార్టీలోకి హృదయపూర్వక స్వాగతం తెలిపారు. ఇది ఏ ఒక్క కుటుంబానికి సంబంధించింది కాదని, 140 కోట్ల దేశ ప్రజలందరికీ సంబంధించిన పార్టీ అని, ఇవాళ మీరంతా పార్టీలో చేరడంతో దేశం గర్వపడుతుందన్నారు.

## వైద్యాశాఖ మంత్రిని కలిసిన పల్లె దవఖాన డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

**జనపదం, బ్యూరో:** తెలంగాణ వైద్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను బుధవారం తెలంగాణ పల్లె దవఖాన అసోసియేషన్ డాక్టర్స్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తూ సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని, అవసరమైన వారికి మెడిసిన్స్ ఇస్తున్నామని, క్యాంపులు, నేషనల్ ప్రోగ్రామ్స్ స్టేట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు వారు మంత్రికి వివరించారు. పల్లె దవఖాన డాక్టర్లకు తక్కువ జీతం ఉందని, రెండేళ్లుగా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమ సేవలు గుర్తించి జీతం పెంచాలని, మెడికల్ ఆఫీసర్లుగా గుర్తించాలని అసోసియేషన్ డాక్టర్స్ తెలంగాణ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ వీరేంద్రనాథ్, డా. రవి కుమార్, డా.దశరథ్, డా. సురేష్, డా.విజయ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

**రూ 2. 25 కోట్ల గంజాయి స్వాధీనం**

**జనపదం, ఆదిలాబాద్ :** అంతరాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్టు ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం బుధవారం తెలిపారు. ఆంధ్ర, ఒడిశా బార్డర్ నుండి మహారాష్ట్ర బుల్దాన, దూలే జిల్లాలకు తరలిస్తున్న గంజాయి కంటైనర్ ను తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్ పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 900 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ 2. 25 కోట్ల ఉంటుందన్నారు. 8మందిపై కేసు, ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.





# ఫిర్ ఏక్ బార్ బీజేపీ సర్కార్

- జనం నాడి ఇదేనన్న మోదీ
- హర్యానా ఎన్నికల సభలో ప్రధాన మంత్రి
- ఆదరించాలంటూ వినతి

**జనపదం, బ్యూరో :** హర్యానా అసెంబ్లీ ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ కాంగ్రెస్ ప్రజాదరణ కోల్పోతోందని, బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మరోసారి బీజేపీ సర్కార్ అంటూ హర్యానా ప్రజానీకం ముక్తకంఠంతో చెబుతోందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోనిపట్ జిల్లాలోని రోహ్‌తక్–పానిపట్ హైవే బైపాస్ వెంట బుధవారం ఏర్పాటు చేసిన ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. గాంధీ కుటుంబంపై ప్రధాని విమర్శలు గుప్పిస్తూ హర్యానాను మధ్యవర్తులు అల్లుళ్లకు కాంగ్రెస్ అప్పగించిందని అన్నారు. కాంగ్రెస్ ఎక్కడ అడుగు పెడితే అక్కడ అవినీతి, ఆశ్రిత పక్షపాతం తప్పనిసరని, ప్రభుత్వ వ్యవస్థలో అవినీతిని తీసుకువచ్చింది. దేశంలో అవినీతికి జన్మ స్థానమైనది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు.

### వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో టాప్ ప్లేస్

బీజేపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలిచిన రాష్ట్రాల్లో హర్యానా ఒకటని ప్రధాని అన్నారు. పారిశ్రామికీకరణ జరిగినప్పుడు పేదలు, రైతులు, దళితులు ఎక్కువగా ప్రయోజనాలు పొందారని చెప్పారు. హర్యానాను 'మెడల్ ఫ్యాక్టరీ'గా మోదీ అభివర్ణించారు. అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు అనేక మెడల్స్ తెచ్చుకుంటున్నారని అభినందించారు. కాగా, 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ 5న పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.



# ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం ..

- దశాబ్ధాలుగా వెనుకబడి ప్రాజెక్టును పూర్తిచేస్తాం
- 12 లక్షల ఎకరాలకు సాగు నీటిని ఇవ్వడమే ధ్యేయం
- పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


**జనపదం, మహబూబ్ నగర్ :** దశాబ్దాలుగా వెనుకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి మంత్రి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలోని ఉదండాపూర్ జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు– రంగారెడ్డిపై రూ.27,500 కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు– రంగారెడ్డికి నీటి వాటాను సైతం సాధించలేకపోయారని ఆరోపించారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్లతో పాటు, కోయిల్ సాగర్ సహా అన్ని ప్రాజెక్టులను నూటికి నూరు శాతం పూర్తి చేస్తామని వెల్లడించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిర్మాణదశలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని, దీనిలో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్ కింద ఆర్ అండ్ ఆర్ కు రూ. 45 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఉదండాపూర్‌తో పాటు, ఇతర రిజర్వాయర్లలో ముంపునకు గురైన వారికి న్యాయపరంగా పునరావాసం అందిస్తామన్నారు. భూ సేకరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న రూ.3 కోట్లు, పునరావాస కల్పనకు సంబంధించి రూ.2 కోట్లు, ఉదండాపూర్ నిర్మాణాలకు రూ.13 కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని పేర్కొన్నారు.


### నిర్వాసితుల నిరసన

ఎన్నికలకు ముందు నిర్వాసితులకు రూ.25 లక్షల పునరావాస ప్యాకేజీ సహా భూముల పరిహారం పెంచుతామని, 18 ఏళ్లు పూర్తైన వారికి ప్యాకేజీ వర్తింపజేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అవేవీ నెరవేర్చకుండా ప్రాజెక్టుల పనులు ఎలా మొదలు పెడతారని ఉదండపూర్ భూనిర్వాసితులు నిరసనకు దిగారు. ఉదండపూర్ జలాశయాన్ని సందర్శించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ మల్లు రవిను నిర్వాసితులు నిలదీశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్యాకేజీ పెంపు, వ్యవసాయ భూముల పరిహారం పెంపు, పునరావాసం పూర్తయ్యే వరకూ ప్రాజెక్టు పనులు జరగనివ్వబోమని నిర్వాసితులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ఉదండపూర్ జలాశయ పనులను రెండు నెలల పాటు నిలి పివేద్దామని ప్రభుత్వం సూచిస్తే ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి రూ.45 కోట్లు విడుదల చేయించామని తెలిపారు. ప్యాకేజీని రూ.25 లక్షలకు పెంచాలని ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశానని, అసెంబ్లీలో సైతం ఉదండపూర్ అంశాన్ని ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రస్తుతం మూడు తండాలకు ప్యాకేజీ డబ్బులు చెల్లించామని, వల్లూరు, ఉదండపూర్ గ్రామాలకు సైతం త్వరలోనే డబ్బులు జమ అవుతాయన్నారు. గతంలో ప్రభుత్వ భూముల్ని తమ పేరుపై రాయించుకుని కొందరు పరిహారం పొందారని, ఆర్అండ్ఆర్ విషయంలో అక్రమాలు ఉన్నందువల్లే ప్యాకేజీ డబ్బులు చెల్లించకుండా కొంతమేర జాప్యం చేశామన్నారు. ప్యాకేజీ డబ్బులు, ఇండ్ల స్థలాలు పునరావాసం అన్ని సమస్యల్ని తీర్చుతామని స్పష్టం చేశారు.

# ప్రతిపక్షాలపై ఈడీ దాడులు సబబా ?

- ప్రభుత్వాలను పడగొట్టడం సరికాదు
- మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ
- ఐదు ప్రశ్నలు సంధించిన ఆప్ కన్వీనర్





**జనపదం, న్యూఢిల్లీ :** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఈ సం దర్భంగా ఆయన ఐదు ప్రశ్నలు సంధించారు. ఈడీ, సీబీఐతో బెదిరింపులకు దిగుతూ ఇతర పార్టీల నేతలపై విరుచుకుపడుతున్నారని లేఖలో పేర్కొన్నా రు. ఇతర పార్టీల ప్రభుత్వాలను కూలుస్తున్నారని, ఎన్నికల ప్రభుత్వాలను పడగొట్టడం దేశానికి, ప్రజాస్వామ్యానికి మం చిదేనా..? అంటూ ప్రశ్నించారు. తాను రాజకీయ పార్టీ నేతగా లేఖ రాయడం లేదని.. సాధారణ పౌరుడిగా రాస్తున్నట్లు తెలిపారు. దేశ పరిస్థితిపై తాను ఆందోళన చెందుతున్నానన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని, దేశ రాజకీయాలను ఏ దిశగా తీసుకెళ్తున్నది.. అది యావత్ దేశానికి హానికరమని.. ఇలాగే కొనసాగితే మన ప్రజా స్వామ్యం, దేశం అంతమవుతుందన్నారు. పార్టీలు వస్తాయి.. పోతుంటాయని.. నాయకులు వస్తుంటారు.. పోతుంటారని.. కానీ, దేశం ఎప్పుడూ ఉంటుందన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఎప్పుడూ సగర్వంగా ఎగురవేయడం మన బాధ్యత అన్నారు.

# మరో మూడు రోజులు భారీ వర్షాలు..

**పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్..**



**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిషా తీర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తోందని పేర్కొంది. గురువారం ఆదిలాబాద్, కొమురంభీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుసే అకాశ ముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది.

# హైడ్రాలో కొత్తగా 169 పోస్టులు

- డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లో సిబ్బంది నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం



**జనపదం, హైదరాబాద్ :** హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణకు ఏర్పాటైన హైడ్రాకు ప్రభుత్వం సిబ్బందిని కేటాయించింది. మొత్తం 169 మంది సిబ్బందిని కేటాయిస్తూ బుధవారం జీవో జారీ చేసింది. ఈ సిబ్బందిని డిప్యుటేషన్ ప్రక్రియలో నియమించుకోవాలని సూచించింది.మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు ఈ సిబ్బందిని కేటాయించింది.ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది.

**మంజూరైన పోస్టులు, కేడర్, వేతనాల వివరాలు..**

కమిషనర్ (IAS ర్యాంక్)-1- కేడర్ పోస్ట్, అదనపు కమిషనర్ (ఎస్పీ ర్యాంక్)- 1- క్యాడర్ పోస్ట్, అదనపు కమిషనర్ (ఎస్పీ ర్యాంక్)- 3 పోస్టులు( రూ.83,100-రూ.1,54,690), డిప్యూటీ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ - 5 పోస్టులు- (రూ.58,850-రూ.1,37,050), ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ -16 పోస్టులు- (రూ. 51,320-రూ.1,27,310), సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్- 16 పోస్టులు –(రూ. 42,300-రూ.1,15,270)

# ఘోష్.. మళ్లీ సీరియస్..

- అప్పులెలా తీసుకున్నారు..?
- ప్రాజెక్టు వైఫల్యాలకు బాధ్యులెవరు..
- రుణాలు తీసుకున్న తర్వాత కార్పొరేషన్కు ఆస్తులొచ్చాయా..?
- ఇంజనీర్లను ప్రశ్నించిన కాళేశ్వరం కమిషన్
- సమాధానాలు దాట వేసిన చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి
- ఆగ్రహం వ్యక్తం చేసిన జస్టిస్ పీసీ ఘోష్



**జనపదం, బ్యూరో:** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అధికారులపై కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అఫడవిట్లకు, చెప్పే సమాధానాలకు పొంతన లేదని, అధికారిక స్థాయిలో ఉండి తెలియదు.. అని చెప్పడం కరెక్ట్ కాదంటూ హెచ్చరించారు. కాళేశ్వరంపై కమిషన్ విచారణ కొనసాగుతోంది. బుధవారం నాటి విచారణకు కాళేశ్వరం కార్పొరేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకట అప్పారావు, ఇరిగేషన్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ మణిభూషణ్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులపై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. ఏ ప్రాతిపదికన లోన్లు తీసుకుంటారని కమిషన్ ప్రశ్నించింది. ప్రభుత్వ అప్రూవల్‌తోనే కార్పొరేషన్ లోన్‌కు వెళ్తుందని, నాబార్డ్ నుంచి అప్పులు తీసుకున్నామని వెంకట అప్పారావు తెలిపారు. పెద్ద మొత్తంలో లోన్లు తీసుకోవడానికి మీ వద్ద ఉన్న ఆస్తులు ఏంటని పిసి ఘోష్ ప్రశ్నించారు. రామగుండం ఎన్టీపీసీకి నీళ్లను సరఫరా చేయడం ద్వారా..వచ్చే ఆదాయంతోనే మెయింటెనెన్స్ చేస్తామని ఆఫీసర్ల వివరణ ఇచ్చారు. ప్రాజెక్టు ప్లానింగ్ ముందే లోన్ తీసుకోవాలనుకున్నారా పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయలేదని పద్మావతి తెలిపారు. తీసుకున్న అప్పుల్ని బడ్జెట్లో చూపించారా అని ప్రశ్నించిన కమిషన్.. బడ్జెట్లో చూపించలేదని పద్మావతి తెలిపారు. కమిషన్ ప్రశ్నలకు తన పరిధిలో లేని అంశాలని భూషణ్ శర్మ దాట వేశారు. మూడు బ్యారేజీల ఎస్టిమేషన్స్‌ను ముందే ఆడిట్ చేశామని వివరణ ఇచ్చారు. కాగ్ రిపోర్టుతో తమకు సంబంధం లేదని కమిషన్‌కు అధికారులు వివరించారు.

### బాధ్యత ఎవరిది..?

కాళేశ్వరం ప్రాజెక్టులో ఆర్థిక క్రమశిక్షణా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని కమిషన్ ఫైనాన్స్ అధికారులను ప్రశ్నించింది. ఈ క్రమంలోనే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, ఉద్యోగుల జీతాలు, చెల్లింపులపై ఆరా తీసింది. గతంలో దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా వారిని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల సేకరణ, బిల్లుల చెల్లింపులు, సంబంధిత అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, సిబ్బంది, ఉద్యోగుల జీతాలు, చెల్లింపుల గురించి ఆరా తీశారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకొని బిల్లులు వెంటనే చెల్లించకుండా బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసినట్లు వెంకట అప్పారావు చెప్పగా.., వాటి ద్వారా వచ్చిన మొత్తాన్ని కార్పొరేషన్ నిర్వహణ కోసం వాడినట్లు తెలిపారు. కార్పొరేషన్ ట్రేడింగ్ బ్యాలెన్స్ అకౌంట్స్ ప్రతి సంవత్సరం చెక్ చేస్తారా, రుణాలు ఎవరి ఆదేశాల మేరకు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. అయితే, రుణాలు ఎవరి ఆదేశాల మేరకు తీసుకున్నారని కమిషన్ అడుగగా.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, కార్పొరేషన్ బోర్డు ఆమోదం తర్వాత రుణాలు తీసుకున్నట్లు ఫైనాన్స్ అధికారులు చెప్పారు.

### ఆస్తులేమైనా వచ్చాయా..?

కాళేశ్వరం కార్పొరేషన్ కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, కార్పొరేషన్ బోర్డు ఆమోదం తర్వాత రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెప్పగా.. కాళేశ్వరం కార్పొరేషన్కు రుణాలు తీసుకున్న తర్వాత ఏమైనా ఆస్తులు వచ్చాయా అని జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రస్తుతం కార్పొరేషన్కు ఎలాంటి ఆదాయం లేదని, ఆస్తులు రాలేదన్న అధికారులు, బిల్లుల చెల్లింపులు నిబంధనల ప్రకారమే జరిగాయని తెలిపారు. కాగ్ నివేదిక గురించి అకౌంట్స్ అధికారులను జస్టిస్ పీసీ ఘోష్ అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు బిల్లుల చెల్లింపు విషయంలో కాగ్ నివేదికతో అంగీకరిస్తారా అని ప్రశ్నించారు. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా కాగ్ నివేదిక ఇచ్చిందన్న అధికారులు, ఆర్థిక స్థోమత, క్రమశిక్షణా వైఫల్యం విషయంలో తాము స్పందించలేమని తెలిపారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. పలు ప్రశ్నలకు తనకు సంబంధం లేదు, తెలియదని, చెప్పలేనని పద్మావతి సమాధానం ఇచ్చారు. చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్గా ఉండి తెలియదంటే ఎలా అంటూ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖజానాపై అంత భారం పడుతుంటే పట్టింపు లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బలహీన వర్గాల అభ్యున్నతే ఐలమ్మకు నివాళి..

- ఆమె స్ఫూర్తితోనే బీఆర్ఎస్ బీసీలకు పథకాలు పెట్టింది..
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్..
- ఐలమ్మను స్మరించుకుంటూ నివాళి..



**జనపదం, హైదరాబాద్ సిటీ :** బలహీన వర్గాలు, నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేయడమే ఐలమ్మకు మనం అర్పించే నిజమైన ఘన నివాళి అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. అణిచివేతకు గురైన బలహీన వర్గాల తిరుగుబాటు తత్వానికి, ప్రతిఘటనా పోరాటానికి ఐలమ్మ స్ఫూర్తిగా నిలిచారన్నారు. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, అస్తిత్వ ఉద్యమంలో స్వయం పాలన కోసం కొనసాగిన పోరాటంలో, పెద్ద ఎత్తున బహుజనులు భాగస్వామ్యం కావడం వెనక నాటి వారి పోరాట స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ అన్నారు. చిట్యాల ఐలమ్మ ఆకాంక్షలకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్ర తొలిప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ, ప్రగతి కార్యాచరణ ను అమలు చేసిందని గుర్తు చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ సబ్బండ వర్గాలకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వేలకోట్ల రూపాయలతో పలు పథకాలను అమలుచేసి వారిని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిపిందన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన ఐలమ్మ ప్రతిఘటనాతత్వం ఎల్లవేళలా ఆదర్శమని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారంగా నిర్వహించాలని నిర్ణయించి అమలు చేసిందన్నారు.



## సాగు చట్టాలపై వ్యాఖ్యలు నా వ్యక్తిగతం

**వెనక్కి తీసుకుంటున్నా .. బీజేపీ ఎంపీ కంగన రనౌత్**

**జనపదం, న్యూఢిల్లీ :** వివాదాస్పద వ్యాఖ్యలతో ఇటీ వల తరచు వార్తల్లో నిలు స్తున్న బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా ర నౌత్ సాగుచట్టాల వ్యాఖ్యలపై వెనక్కి తగ్గారు. 2021 లో రద్దు చేసిన సాగు చ ట్టాలను మళ్లీ తీసుకురావాలంటూ ఆమె చేసిన వ్యా ఖ్యలపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై కంగన తాజాగా స్పందించారు. తన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతూ, వాటిని వెనక్కి తీసుకుంటున్నానని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక వీడియో పోస్ట్ చేశారు. సాగు చట్టాలపై తన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమైనవని, పార్టీ వైఖరితో వీటికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. గత కొద్దిరోజులుగా సాగుచట్టాలపై మీడియా కొన్ని ప్రశ్నలు అడుగుతోందని, సాగుచట్టాలను వెనక్కి తీసుకురావాలని ప్రధానిని రైతులు రిక్వెస్ట్ చేయాలని నేను సూచించానని తెలిపారు. సాగు చట్టాలను ప్రతిపాదించినప్పుడు మనలో చాలా మంది మద్దతిచ్చారు. కానీ ప్రధానమంత్రి ఎంతో సెన్సిటివిటీ, సానుభూతితో వాటిని ఉపసంహరించారని గుర్తు చేశారు. ప్రధాని నిర్ణయానికి కట్టుబడి ఉండటం ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యత అని, ఇప్పుడు నేను కేవలం నటిని మాత్రమే కాదని, ఓ రాజకీయ కార్యకర్తనన్నారు. వ్యక్తిగతంగా చెప్పినప్పటికీ పార్టీ వైఖరిని ప్రతిబింబిస్తాయనే విషయాన్ని గుర్తించానని, నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధిస్తే క్షమాపణ చెబుతున్నాను. వాటని వెనక్కి తీసుకుంటున్నాను అని అని కంగన ఆ వీడియోలో తెలిపారు. కాగా, కంగనా వ్యాఖ్యలపై బీజేపీ దూరం పాటిం చింది. కంగన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, పార్టీ తరఫున అలాంటి వ్యాఖ్యలు చేసే అధికారం ఆమెకు లేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఓ ప్రకటనలో తెలిపారు.

# రాజకీయలకు అతీతంగా బీసీ ఉద్యమం..

- బలోపేతానికే ఎంపీ పదవికి రాజీనామా
- చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాజకీయాలకు అతీతంగా బీసీ ఉద్యమం చేయబోతున్నట్లు తాజా మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రకటించారు. ఈ ఉద్యమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు న్యాయం జరగాలన్నారు. బీసీ ఉద్యమం బలోపేతం చేయడానికే తాను రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ విద్యానగర్ లోని బీసీ భవన్ మీడియాతో ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. వివిధ పద్ధతులను అనుసరిస్తూ ఉద్యమం చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడం లేదని ఆయన ఆరోపించారు. బీసీల తరపున తానలాంటి వారెందరో చట్టసభల్లో ప్రశ్నించినా సమాధానం రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఇంకా నాలుగేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ బీసీల గురించి ఆలోచించే ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సివచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ఉద్యమం, బీసీ ఉద్యమమే తన కార్యాచరణ అని, రాజ్యాధికారంలో వాటాతో పాటు చట్టసభల్లో 50 శాతం సీట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని, బీసీల కోసం చాలా త్యాగాలు చేయాల్సివస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేయబోతున్నామని, అన్ని పార్టీల వారు ఈ ఉద్యమంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడమే నా జీవిత లక్ష్యమని, దీనికోసం ప్రతి బీసీ బిడ్డా పోరాడాలి అని ఆర్. కృష్ణయ్య కోరారు.

# ప్రజల్లో ఉండి పనిచేయాలి..

- బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్
- బీజేపీ స్టేట్ ఆఫీస్ లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి



**జనపదం, నాంపల్లి :** పేదల అభ్యున్నతికి భారతీయ జన సంఘ్ (పూర్వ బీజేపీ) సి ద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ కృషి చేశారని, ఆయన ఆశయా ల కోసం కార్యకర్తలు, నా యకులు నిరంతరం ప్రజ ల్లో ఉండాలని బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ సూచిం చారు. పార్టీ విత్ డిఫెన్స్ అనే నినాదంతో కార్యకర్తల ని ర్మాణంతో, సిద్ధాంతం ఆధారంగా బీజేపీ పని చేస్తున్నదని ఆ యన స్పష్టం చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ని ర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎ మ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ పండిట్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అ నంతరం ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ అంత్యోదయ సి ద్ధాంతాన్ని ప్రవ చించి పేదలకు, నిరుపేదలకు ప్రభుత్వ ఫలా లు అందాలని కోరుకున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంతరం పని చేస్తున్నారని అన్నారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందాలని, పేదలో అత్యంత పేదవారికి దేశ సంపద ఫలాలు అందాలని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ కలల సహకారం చేస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కుల, మత, వర్గ భేదం లేకుండా అందరికీ నేరుగా ఫలాలు అందేలా దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలు డిజిటల్ మార్గం ద్వారా అందజేస్తున్నామని అన్నారు. కాం గ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అవినీతి, కుంభకోణాలతో కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. ఇప్పుడు ఎ క్కడ ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న అవినీతి నిత్యకృత్యమైందని ఆయన ఆరోపించారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అవినీతి పెరిగిపోయిందని లక్ష్మణ్ ఆరోపించారు.

# కొత్త మురిపెం.. కొసెల్లేనా..?

- ఆఖరి వరకు నడిస్తే అదే మహాభాగ్యం..
- గాంధీభవన్ లో ఫిర్యాదుల స్వీకరణ..
- ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తామన్న టీపీసీసీ మహేశ్, మంత్రి దామోదర
- గతంలో వినేవారు లేరు.. మేం వింటామని హామీ..
- తొలి రోజు 285 దరఖాస్తులు.. తక్షణమే 30 పరిష్కారం..



**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** గాంధీభవన్ వేదికగా జరుగుతున్న మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంపై రాష్ట్ర ప్రజలు, పార్టీ శ్రేణులు ఎంతో భరోసా పెట్టుకున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల కష్టాసుఖాలు వినేవారు లేరన్న ఆయన కాంగ్రెస్ ప్రజాపాలనలో తాము అందరి సమస్యలు వినేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మంత్రులతో ముఖాముఖిలో వచ్చే ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తామని వెల్లడించారు. బుధవారం గాంధీభవన్ లో ప్రారంభమైన మంత్రులతో ముఖాముఖి తొలి కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి ఆయన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలు ఇచ్చిన అర్జీలను మంత్రులు తీసుకొని సంబంధిత శాఖల అధికారులతో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖాముఖి కార్యక్రమం ఒక నిరంతర ప్రక్రియ అన్న మహేశ్ కుమార్ గౌడ్ ప్రజలు ప్రశాంతంగా ఉండి సమస్యలు పరిష్కారం చూసుకోవాలన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ముఖాముఖి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీకి ప్రభుత్వానికి ఈ కార్యక్రమం ద్వారా మంచి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తొలిసారిగా నిర్వహించిన కార్యక్రమంలో 285కు పైగా అప్లికేషన్లు వచ్చాయన్న మంత్రి వాటిలో ఆరోగ్యసమస్యలు, జీఓ 317 బాధితులు, భూ వివాదం, అక్రమ కేసులు, బదిలీలు అంటూ, ఉద్యోగాలు, వైద్య సేవల వంటి ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో గాంధీ, ఉస్మానియా, పోలీస్ స్టేషన్లకు చెందిన 30 అర్జీలను వెంటనే పరిష్కరించినట్లు మంత్రి వెల్లడించారు. కాగా తమ గోడును వెల్లబోసుకునేందుకు వచ్చిన మహిళలు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, తల్లులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకున్నామన్నారు. డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్ రావ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, అధికార ప్రతినిధులు భవాని రెడ్డి, బండారు శ్రీకాంత్, అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మరో 35 వేల పోస్టుల భర్తీ..

- యువతకు ఉపాధియే లక్ష్యం..
- నిరుద్యోగులు డిమాండ్ సప్లయ్ సూత్రం గుర్తెరగాలి..
- ఉపాధి లేక చెడుమార్గంలో పోవొద్దు..
- రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీలపైనా దృష్టి
- బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి




**జనపదం, బిజినెస్ బ్యూరో:** తమ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, డీఎస్సీ, గ్రూప్స్ విభాగాల్లో మరో 35 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టామని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు. త్వరలో మరో 35 వేల పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఏటా 3 లక్షల మంది పట్టాలు తీసుకుని బయటకు వస్తున్నారన్న సీఎం, ఉపాధి అవకాశాలపై పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడినట్లు వివరించారు. ఎలాంటి కోర్సులు చదివిన వారు కావాలని పరిశ్రమల యజమానులను అడుగుతున్నామని, అందుకు తగ్గట్టుగానే నిరుద్యోగ యువత డిమాండ్-సప్లయ్ సూత్రం గుర్తుంచుకోవాలని రేవంత్‌రెడ్డి తెలిపారు. మాసబ్‌ట్యాంక్‌లో బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రామ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. బీఎఫ్ఎస్ఐ రంగాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పేందుకు స్కిల్ ప్రోగ్రా మ్ను సీఎం, మంత్రి శ్రీధర్బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డిగ్రీ చదివేవారు భవిష్యత్తు దిశగా ఆలోచించాలని కోరారు. కొందరు విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, బ్యాంకులు, బీమా రంగాల్లోనూ ఎక్కువ ఉద్యోగవకాశా లు ఉన్నాయని వివరించారు. నాయకుడిగా రాణించాలన్నా నైపుణ్యం ఉండాలని ఉద్ఘాటించారు. ఉద్యోగాలు, ఉపాధి లేకుంటేనే యువత చెడు వ్యసనాల వైపు వెళ్లే ప్రమాదం ఉందని, ఈ క్రమంలోనే బీటెక్ చదివిన వారు కూడా డ్రగ్స్ విష వలయంలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సమస్య నిర్మూలనకు కార్యక్రమం చేపట్టామని, ప్రభు త్వం ఒక్కటే దీన్ని పరిష్కరించలేదని అంద రూ కలిస్తేనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యమని, మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మారాలని, మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని సీఎం అన్నారు.

### మాదే బాధ్యత

పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు అం దించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యను గుర్తించామని, అన్ని శాఖల్లో భర్తీ ప్రక్రియ చేపట్టామని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విరివిగా కల్పిస్తున్నామని చెప్పారు. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా వినూత్న కోర్సుకు రాష్ట్ర సర్కార్ శ్రీకారం చుట్టినట్లు వివరించారు. నాలెడ్జ్, కమ్యూనికేషన్ ఉంటేనే మంచి ఉద్యోగాలు వస్తాయని, చదివిన డిగ్రీకి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు గ్యాప్ ఉంటోందని సీఎం తెలిపారు. బీఎఫ్ఎస్ఐకు అవసరమైన స్కిల్స్ నేర్పేందుకు కోర్సు ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులు జాబ్ స్కిల్స్ నేర్చుకోవడం లేదని, కొన్ని కళాశాలల్లో అధ్యాపకులు, వసతులు ఉండటం లేదని సీఎం ఆక్షేపించారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే గుర్తింపు రద్దు చేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు. త్వరలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని వివరించారు.

### ఇంజినీరింగ్ కాలేజీలపై దృష్టి పెట్టాం

గత పదేళ్లలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కొంతమంది తెలంగాణ యువత గంజాయ, డ్రగ్స్ కు బానిసలయ్యారని, ఇటీవల పట్టుబడినవారిలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఉండటం ఆందోళనకరమైన విషయం అని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, గంజాయి నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వ్యసనాల నుంచి యువతను బయటపడేయాలంటే ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా 65 ఐటీఐలను అప్ గ్రేడ్ చేసి టాటా టెక్నాలజీస్ సహకారంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, రాబోయే రెండేళ్లలో అన్ని ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలపైనా ప్రత్యేక దృష్టి సారించామని, కనీస ప్రమాణాలు లేకపోతే ఇంజనీరింగ్ కాలేజీల అనుమతులు రద్దు చేయడం ఖాయమని హెచ్చరించారు. పాలిటెక్నిక్ కాలేజీలను అప్ గ్రేడ్ చేస్తున్నామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా విద్యార్థులకు నైపుణ్యం అందించబోతున్నామని, హైదరాబాద్ ను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడమే కాదు.. నైపుణ్యం అందించడంలోనూ హైదరాబాద్ కేరాఫ్ గా మార్చనున్నామని, సాంకేతిక నైపుణ్యానికి హైదరాబాద్ డెస్టినేషన్ కావాలని, ప్రపంచ వేదికపై హైదరాబాద్ ను విశ్వనగరంగా నిలబెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. రాబోయే ఏడాదిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ , స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తామని, తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో చదివిన వారు ప్రపంచంలోనే పెద్ద సంస్థలకు సీఈవోలుగా ఉన్నారని, అలాంటి వారి సహకారం తీసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని సీఎం చెప్పారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com